www.kalamjyothi.com


# కలంజ్యోతి

రేపటి కోసం

సోమవారం

28 ఏప్రిల్ 2025

విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



# తెలంగాణకు విలన్ కాంగ్రెస్సే

2లో

**బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు**



3లో

## నక్సలిజం సామాజిక సమస్య

**శాంతి చర్చల కమిటీ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

కలంజ్యోతి, నిర్మల్ : నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వహక సమావేశం ఈనెల 29న నిర్మల్ లో నిర్వహించ నున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు తెలిపారు. ఖానాపూర్, నియోజకవర్గ ఎమ్మెల్యే ,మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, పార్టీ యువజన, మహిళ, రైతు, విద్యార్థి విభాగం, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓబీసీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, పీసీసీ సభ్యులు, సేవాదళ్ అధ్యక్షులు, ఆయా పట్టణ, మండలాల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ మున్సిపల్ ఛైర్మన్లు సమావేశానికి హాజరు కావాలని కోరారు. స్థానిక మంజులాపూర్ రోడ్ లోని మారుతి ఇన్ హోటల్ లోని ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి పీసీసీ పరిశీలకులు చంద్రశేఖర్ గౌడ్, అవేజ్ లు హాజరవుతున్నారని పేర్కొన్నారు.



## రేపు జిల్లా కాంగ్రెస కార్యనిర్వహక సమావేశం

కలంజ్యోతి
సోమవారం 28.04.2025 General News



# సభకు వాడింది ఆ సొమ్మేనా?

## బీఆర్ఎస్ పై ఎంపీ చామల సెన్సేషనల్ కామెంట్స్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సర్వం సిద్ధమైంది. వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వేదికగా 25 ఏళ్ల ఆవిర్భావ సభను గులాబీ అధినాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలోనే అదే సభపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సోషల్ మీడియా ప్లాట్ ఫాం 'ఎక్స్' వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ రాజకీయ పార్టీ ఒక మాదిరి సభ పెట్టాలంటే ఖర్చులు భరించలేక నాయకుల నరాలు తెగుతాయన్నారు. ఒక్కో రూపాయి పోగేసి సభను సక్సెస్ చేస్తే చాలు.. హమ్మ్య అని ఊపిరి పీల్చుకుంటాని తెలిపారు. ఇక ప్రతిపక్షంలో ఉండి ఓ సభ నిర్వహించాలంటే ఎంత నరకమో చెప్పనక్కర్లేదు. కానీ, బీఆర్ఎస్ రజతోత్సవ సభ చూస్తుంటేనే కళ్లు చెదురుతున్నాయని అన్నారు. రూ.వందల కోట్లు ఖర్చు చేస్తే తప్ప.. అలా సభ నిర్వహించడం సాధ్యం కాదని తెలిపారు. జనాన్ని ఎంత మందిని తోలుతారు. అందుకు ఖర్చెంత అనేది తరువాత విషయమని.. సభ ఏర్పాట్ల తీరే కళ్లు బైర్లు కమ్మేలా ఉన్నాయని కామెంట్ చేశారు. ఆ వేదిక, హంగామా, ఆర్భాటం చూస్తుంటే ఊహకందనంత ఖర్చే అయి ఉంటుందనే విషయం సామాన్యుడికి కూడా అర్థమవుతోందని అన్నారు. ఆ డబ్బు కూలిన కాళేశ్వరం సొమ్మా అని ప్రశ్నించారు. మిషన్ భగీరథ పేరుతో పాత ట్యాంకులకు రంగులేసి.. పాత తాగునీటి పథకాలను లింక్ చేసి దోచిన సొమ్మా? అని సెటైర్లే వేశారు. హైదరాబాద్ బిల్డర్ల దగ్గర పర్మిషన్ల కోసం వసూలు చేసిన అదనపు ఫ్లోర్ల కమీషన్ సొమ్మ అంటూ ఫైర్ అయ్యారు. ఫార్ములా ఈ కారు రేస్ పేరుతో ప్రైవేటు కంపెనీలకు దోచిపెట్టిన సొమ్మా, ధరణి పేరుతో అర్ధరాత్రుల్లో భూ హక్కులను మార్చేసి దోచిన వేల ఎకరాల దోపిడీ సొమ్మా అంటూ నిలదీశారు. కానామెట్, నియోపోలీస్, కోకాపేట్ లలో వేల కోట్ల విలువ చేసే భూములను వేలం పేరుతో అనునయులకు దోచిపెట్టగా వచ్చిన సొమ్మా అని ధ్వజమెత్తారు. రూ.లక్షల కోట్ల విలువ చేసే ఔటర్ రింగ్ రోడ్డును కేవలం రూ.7 వేల కోట్లకు 33 ఏళ్ల పాటు ప్రైవేటు కంపెనీకి ధారాదత్తం చేయడంతో వచ్చిన సొమ్మా? అని అన్నారు. కేవలం 2 గంటల సభ కోసం ఖర్చు చేస్తోన్న రూ.కోట్ల ధన ప్రవాహం ఏ కమీషన్ల తాలుఖాదో తెలంగాణ సమాజానికి బీఆర్ఎస్ చెప్పాలి అంటూ చామల ట్వీట్ చేశారు.



# ప్రజల పక్షాన పోరాడే పార్టీ బీఆర్ఎస్

## నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**కలంజ్యోతి, నర్సాపూర్ :** ప్రజల పక్షాన పోరాడే పార్టీ బీఆర్ఎస్ సేనని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత బీఆర్ఎస్ పార్టీకి దక్కుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం నర్సాపూర్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో నిలిచి పోయేలా కేసీఆర్ ఆధ్వర్యంలో రజోతోత్సవ సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సభకు బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా తరలిరావడం జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని తెచ్చి అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కేసీఆర్ మళ్ళీ రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని ఆమె తెలిపారు. ప్రజా సంక్షేమం అభివృద్ధి కేసీఆర్ తోనే సాధ్యమవుతుందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



# తెలంగాణకు విలన్ కాంగ్రెస్సే

## బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు

- ఆంధ్రతో బలవంతంగా కలిపారు
- తెలంగాణ బిడ్డల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చారు
- 1969లో తెలంగాణ ఉద్యమాన్ని అణిచేశారు

**కలంజ్యోతి, హన్మకొండ:** తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూ అయితే, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా అణచివేసిందని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడారు. తొలుత జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు.

**తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చింది కాంగ్రెస్ ప్రభుత్వం**

'ఆనాడైనా, ఏనాడైనా.. ఈనాడైనా తెలంగాణకు విలన్ నెంబర్ వన్ కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ హైదరాబాద్ స్టేట్ పేరుతో ఉన్ననాడు.. ప్రజలు వద్దంటే కూడా బలవంతంగా తెలంగాణను ఆంధ్రాతో కలిపిన వారే కాంగ్రెస్ పార్టీ, జవహర్‌లాల్ నెహ్రూ. 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. 400 మంది తెలంగాణ బిడ్డలను పిట్టల్లా కాల్చి చంపింది ఇందిరా గాంధీ ప్రభుత్వం. ఆనాడు ఉన్నటువంటి కాంగ్రెస్ పరిపాలన. 2001 నుంచి విజృంభిస్తే.. నంగనాచిలాగా ఇదే కాంగ్రెస్ వచ్చి.. మన బలాన్ని, మన ఊపును చూసి పొత్తు పెట్టుకొని తెలంగాణ ఇస్తమని నమ్మబలికి మీరు చూశారు. మళ్లీ ఎగొట్టే ప్రయత్నం చేశారు. 14 సంవత్సరాలు ఏడిపించారు. అది మీ అందరికీ తెలుసు. వాళ్లు ఎట్లెట్ల చేస్తుంటే.. వారి మోసాన్ని కప్పేయడానికి నేను.. జయశంకర్ సార్‌తో కలిసి పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు కాంగ్రెస్ గొంతుపట్టుకుంటే.. అప్పుడు దిగివచ్చి తెలంగాణ కోసం ప్రకటన చేసిన విషయం మీకు తెలుసు. మళ్లీ ప్రకటన వెనక్కి తీసుకొని.. మళ్లీ వెనక్కి వెళ్లారు. ఆ తర్వాత సకల జనుల సమ్మె కావొచ్చు. సాగర హారాలు కావొచ్చు. వంటావార్పులు కావొచ్చు.. అనేక రూపాల్లో విజృంభించి భీకరమైన పోరాటం చేశాం'అంటూ గుర్తు చేశారు.

**కాంగ్రెస్, టీడీపీ నేతలు నోరు మెదపలే..**

తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ నాటి కాంగ్రెస్, టీడీపీలో ఉన్న నాయకులు పదవుల కోసం పెదవులు మూశారు తప్పా.. ఏనాడు నోరెతెరిచి కొట్లాడలేదన్నారు. గులాబీ జెండా ఎగిరే వరకు కనీసం తెలంగాణ సోయిని కూడా ప్రదర్శించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం అవసరమైన ప్రతి సందర్భంలో పదవులు త్యాగం చేసినవారు బీఆర్ఎస్ బిడ్డలు అని గర్వంగా చెబుతున్నానని తెలిపారు. కానీ, పదవుల కోసం తెలంగాణను ఆగం చేసినవారు ఆనాడు ఉన్న కాంగ్రెస్ నాయకులు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండి.. ఎంత ఘోరమంటే.. హైదరాబాద్ నడిబొడ్డున ఉండే మన శాసనసభలో తెలంగాణ పదాన్నే నిషేధించాడని గుర్తు చేశారు. తెలంగాణ అనవద్దని స్పీకర్ ద్వారా రూలింగ్ ఇప్పించాడని తెలిపారు. హన్మకొండ జిల్లాకు చెందిన ప్రయణ్ భాస్కర్ ఆ రోజు ఎమ్మెల్యే శాసనసభలో తెలంగాణ అంటే.. అది నేరమైనట్లుగా పరిగణించి తెలంగాణ పదాన్నే నిషేధించే ప్రయత్నించారు. మీ అందరికీ చరిత్ర తెలుసన్నారు.

కలంజ్యోతి 3
సోమవారం 28.04.2025 General News

# నక్సలిజం సామాజిక సమస్య

- శాంతి చర్చల కమిటీ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్ శాంతి భద్రతల అంశంగా పరిగణించదు
- గతంలో జానారెడ్డి నక్సలైట్లతో చర్చలు జరిపారు
- మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం



**కలంజ్యోతి, హైదరాబాద్ :** దేశాన్ని పట్టిపీడిస్తోన్న నక్సలిజాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఓ సామాజిక సమస్యగా భావిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అంతే తప్ప శాంతిభద్రతల అంశంగా పరిగణించడం లేదన్నారు. నక్సలిజం కార్యకలాపాలు సమాజ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని అభిప్రాయపడ్డారు. ఛత్తీస్ గడ్, తెలంగాణ సరిహద్దులోని కర్రెగుట్టపై జరుగుతోన్న కేంద్ర సాయుధ బలగాల కూంబింగ్ ను నిలిపివేసేలా మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని శాంతి చర్చల కమిటీ నేతలు సీఎం రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. ఆదివారం జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో సీఎంతో భేటీ అయిన శాంతి చర్చల కమిటీ నేతలు కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు. ఈ మేరకు కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, దుర్గాప్రసాద్, జంపన్న, రవి చందర్ సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం.. కమిటీ సభ్యులతో మాట్లాడారు. గతంలో నక్సలైట్లతో చర్చలు జరిపిన ఘనత కాంగ్రెస్ కు మాత్రమే దక్కిందని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. చర్చల్లో పాల్గొన్న అనుభవం సీనియర్ నేత జానారెడ్డికి ఉందన్నారు. కమిటీ సభ్యుల విన్నపం మేరకు ఈ అంశంపై జానారెడ్డి సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. తర్వాత మంత్రులతో చర్చించి ఒక నిర్ణయాన్ని తీసుకుంటామని కమిటీ సభ్యులకు సీఎం హామీ ఇచ్చారు.

# మైనర్లకు వాహనాలివ్వొద్దు

## ఎస్పీ జానకి షర్మిల

### ఇస్తే యజమానులపైనే చర్యలు

### జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్



**కలంజ్యోతి, నిర్మల్ :** వాహనాలను లైసెన్సు లేని మైనర్ల చేతికిస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ జానకి షర్మిల స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలో పట్టుబడిన 296 మంది మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ మోటార్ వాహన చట్ట ప్రకారం మైనర్లు ప్రమాదాలకు కారణమైతే వాహన యజమాని బాధ్యత వహించాలన్న విషయాన్ని తల్లి దండ్రులు గ్రహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సుమారు 100 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు అయ్యాయని అన్నారు. మైనర్లకు, వారి తల్లిదండ్రులకు 296 మందికి భైంసా ఎ ఎస్ పి అవినాష్ కుమార్, నిర్మల్ ఎ ఎస్ పి రాజేష్ మీనా స్వయంగా కౌన్సిలింగ్ నిర్వహించారన్నారు. మంగళ వారం రెండవ విడత జిల్లా ప్రధాన కార్యాలయం లో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాలలకు, కళాశాలలకు సెలవుల దృష్ట్యా పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గత కొద్ది రోజులుగా మైనర్ పిల్లలు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పోలీసు తనిఖీల్లో పట్టుబడు తున్నారన్నారు. పట్టుబడ్డవారికి జరిమానాలు విధిస్తూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కేసులు నమోదు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొంటారని స్పష్టం చేశారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల వారు ప్రమాదాలకు గురవటమే కాకుండా ఇతరుల ప్రమాదాలకు కారణం అవుతారని అన్నారు. పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు




ఇవ్వవద్దని ఎస్పీ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత చర్యలు ప్రతిఒక్కరూ పాటించాలని కోరారు. యువత అడ్డగోలుగా వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల బారినపడి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు దుఃఖం మిగల్చారాదని కోరారు.





## రామప్ప ఆలయంలో మెరిసిన

# మిస్ ఇండియా

**కలంజ్యోతి, ములుగు :** తెలంగాణ రాష్ట్రానికి ఒక గొప్ప అవకాశం లభించింది. ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ 2025 పోటీలు ఇక్కడ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మిస్ ఇండియా 2023 నందిని గుప్తా ఇటీవల తెలంగాణలోని చారిత్రాత్మక రామప్ప ఆలయాన్ని సందర్శించారు. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన ఈ అద్భుతమైన ఆలయానికి ఆమె సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఒక సాధారణ తెలుగు అమ్మాయి వలె లంగా ఓణీ ధరించి, స్థానిక సంస్కృతిని గౌరవిస్తూ ఆమె ఆలయ ప్రాంగణంలో కలియతిరిగారు. శిల్పకళా నైపుణ్యానికి ప్రసిద్ధి చెందిన రామప్ప ఆలయ నిర్మాణ శైలిని, దాని ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఆమె ఎంతో అభినందించారు. ఆలయ చరిత్రను అర్చకుల ద్వారా తెలుసుకున్నారు. తెలంగాణలో మిస్ వరల్డ్ వంటి అంతర్జాతీయ కార్యక్రమం నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణం. ఈ పోటీల ద్వారా తెలంగాణ సంస్కృతి, పర్యాటక ప్రదేశాలు ప్రపంచవ్యాప్తంగా మరింతగా ప్రాచుర్యం పొందుతాయని భావిస్తున్నారు. మిస్ ఇండియా నందిని గుప్తా రామప్ప ఆలయాన్ని సందర్శించడం తెలంగాణ యొక్క గొప్ప వారసత్వాన్ని, శాశ్వతమైన సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పే ప్రయత్నంలో ఒక భాగం. ఆమె రాక, రాబోయే మిస్ వరల్డ్ పోటీలు రాష్ట్రంలో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నాయి.



## దీక్షస్వాముల ముడుపుల ద్వారా వచ్చినా

# వస్తువులు బహిరంగ వేలం

**కలంజ్యోతి, మల్యాల :** కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవస్థానంలో 11, 21, 41 రోజులు మాలలో ఉండి విరమణ సమయంలో దీక్షస్వాములు సమర్పించిన ముడుపులు విప్పడం ద్వారా వచ్చిన వస్తువులను ఏప్రిల్ 29 మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు బియ్యం రూ.10వేలు, కొబ్బరికాయలు, ఎండు కుడకలు, ఇత్తడి గంటలుకు గాను రూ.5వేలు, ఎండు ఖర్జుర పోకలకు గానూ రూ.వేయి డిపాజిట్ చెల్లించాలని తెలిపారు.

# కశ్మీర్ అభివృద్ధిని ఓర్వలేక ఉగ్రదాడి

## మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

- దేశ రక్తం మరిగిపోతుంది
- టెర్రరిస్టులపై అత్యంత కఠిన చర్యలు
- బాధితులకు న్యాయం చేస్తాం
- 140 కోట్ల ప్రజల ఆశీర్వాదంతో ఉగ్రమూకను తుదముట్టిస్తాం
- 'ఆపరేషన్ బ్రహ్మ'తో మానవత్వం చాటుకున్నాం
- సాచెట్ యాప్‌తో విపత్తుల తీవ్రత తగ్గుదల

**కలంజ్యోతి, న్యూ ఢిల్లీ:** జమ్మూ కశ్మీర్ లో శాంతి, అభివృద్ధి, ప్రజాస్వామ్యం బలోపేతం కావడం ఉగ్రవాదులు ఓర్వలేక పోయారని అందుకే దాడులకు తెగబడుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్థానికులు ఆర్థికవృద్ధి సాధించడం, యువత ఉద్యోగాలు, విద్య, సాంకేతికత వైపు మళ్లడం ఉగ్రవాదులకు ఇష్టం లేదన్నారు. ఆదివారం ప్రధానమంత్రి మోదీ 121 ఎపిసోడ్ 'మన్ కీ బాత్'లో దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. పహల్గామ్ దాడితో దేశ రక్తం మరిగిపోతున్నదని, ప్రాణాలు కోల్పోయిన వారికి న్యాయం చేకూరుస్తామని ఉగ్రవాదులకు, కుట్రదారులపై అత్యంత కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పహల్గామ్ లో మరణించిన వారిని స్మరించుకుంటూ ప్రపంచం మొత్తం ఈ ఉగ్రదాడిపై ఒకే గొంతుకతో ఉందన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారత్ వెంటే ఉన్నాయన్నారు. బాధితులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కశ్మీర్‌లో శాంతి తిరిగి వస్తుండగా, పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయని చెప్పారు. అభివృద్ధి పనుల్లో వేగం పుంజుకుందన్నారు. ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని చెప్పారు. దీంతో పర్యాటకుల సంఖ్య రికార్డులను సృష్టించేలా పెరుగుతుందని తద్వారా స్థానికుల ఆర్థికం బలపడుతుందని చెప్పారు. యువతకు కూడా వివిధ రంగాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయని చెప్పారు. భారత 140 కోట్ల ప్రజాశీర్వాదంతో ఈసారి దేశంలో ఉగ్రవాదం అనే పదం వినబడకుండా చేస్తామని ప్రధాని మోదీ చెప్పారు.



### 'ఆపరేషన్ బ్రహ్మ'తో మానవత్వాన్ని చాటుకున్నాం..

మయన్మార్ భూకంపంలో 'ఆపరేషన్ బ్రహ్మ'ప్రారంభించింది. ఎంతో మంది విలువైన ప్రాణాలను కాపాడి మరోమారు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను చాటుకున్నామని చెప్పారు. ఈ భారీ విధ్వంసం నేపథ్యంలో ప్రపంచమంతా వసుదైక కుటుంబమని చెప్పారు. మందులు, ఆహారం, రెస్క్యూ బృందాల సహాయక చర్యలతో ఎంతోమంది విలువైన ప్రాణాలను కాపాడి క్లిష్టసమయంలో మానవత్వాన్ని కాపాడుకోవడంలో భారత్ ముందుంటుందని మరోసారి ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. అటు ఆఫ్రికా దేశమైన ఇథియోపియాలో పిల్లలకు గుండె జబ్బులు గుర్తించి ఉచితంగానే చికిత్సలు అందజేస్తున్నామని చెప్పారు. పిల్లల కుటుంబాలు ఆర్థికంగా పటిష్ఠంగా లేకపోయినా ప్రతీ ఒక్కరికి సహాయం చేయాలన్నదే, ప్రతీ ప్రాణాన్ని నిలపాలన్నదే తమ ఉద్దేశ్యమన్నారు.

### ఇస్రో అభివృద్ధికి కస్తూరి సేవలు ఎనలేనివి..

ఇస్రో మాజీ చీఫ్ డాక్టర్ కస్తూరిరంగన్ కు నివాళులర్పించారు. భారత్ ఉపయోగించే అనేక ఉపగ్రహాలు కస్తూరిరంగన్ పర్యవేక్షణలో ప్రయోగించారని హర్షం వ్యక్తం చేశారు. ఆయన వ్యక్తిత్వం ప్రత్యేకమైనది, యువతరం ఆయన రచనల నుంచి చాలా నేర్చుకోవచ్చని చెప్పారు. ఆయన ఎల్లప్పుడూ ఆవిష్కరణకు ప్రాముఖ్యత ఇచ్చారని చెప్పారు. కొత్తగా ఏదైనా నేర్చుకోవడం, అన్వేషించడం, చేయడం పట్ల ఆయన చూపిన విధానం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఇస్రో అభివృద్ధే గాకుండా 21వ శతాబ్దపు విద్యావికాసంపై కూడా ఆయన విధానాలను దేశాన్ని, ప్రపంచాన్ని ఆకట్టుకున్నాయని చెప్పారు. యువతరానికి కొత్త విశ్వాసాన్నిచ్చేలా ఆయన చేపట్టిన అనేక కార్యక్రమాలు ఉదాహరణలుగా నిలుస్తాయని కొనియాడారు. ఇస్రో ఒకేసారి 104 ఉపగ్రాహాలను ప్రయోగించిందని, నేడు అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగానికి కూడా తలుపులు తెరిచామన్నారు. చాలా మంది యువకులు అంతరిక్ష స్టార్టప్‌లలో కొత్త జెండాలు ఎగురవేస్తున్నారు. పదేళ్ల కిందట ఈ రంగంలో ఒకే ఒక సంస్థ ఉండేదని ప్రస్తుతం దేశంలో మూడు వందల ఇరవై ఐదు కంటే ఎక్కువ పెద్ద సంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. ఇక చిన్న సంస్థలకు లెక్కే లేదన్నారు.

### అనేక రంగాల్లో ముందుకు వెళుతున్నాం..

ప్రస్తుతం విపత్తులను ఎదుర్కోవడంలో సాచెట్ మొబైల్ యాప్ పని చేస్తుందని, ప్రకృతి వైపరీత్యంలో చిక్కుకోకుండా కాపాడుతుందని అన్నారు. జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవమని తమ ప్రచారం ఒక సంవత్సరం పూర్తి చేసుకుంటుందని 'ఏక్ పేడ్ మా కే నామ్' కింద ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో వ్యవసాయ రంగంలో నూతన ప్రయోగాలతో ముందుకు వెళుతున్న రైతుల ప్రయత్నాలను ప్రశంసించారు. మహాత్మాగాంధీ నేతృత్వంలో చంపారన్ సత్యాగ్రహంలో విజయాన్ని గుర్తు చేశారు. ఈ సత్యాగ్రహం బ్రిటిష్ పాలనను కదిలించిందని చెప్పారు. ఈ సత్యాగ్రహం గురించి దేశ యువత డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రాసిన పుస్తకాన్ని చదవి తెలుసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.



## తెలంగాణ నూతన సీఎస్ రామకృష్ణారావు

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**కలంజ్యోతి, హైదరాబాద్ :** రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావు నియమితులయ్యారు. ప్రస్తుతమున్న సీఎస్ శాంతి కుమారి ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ప్రస్తుతం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న రామకృష్ణారావుకు రాష్ట్ర సర్కార్ ఈ కీలక బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆయన మే ఒకటో తేదిన రాష్ట్రానికి కొత్త సీఎస్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కార్యదర్శి ఎం. రఘునందన్ రావు ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. 1989 బ్యాచ్‌కు చెందిన ప్రస్తుత సీఎస్ శాంతికుమారి 2021 జనవరి నుంచి సీఎస్ గా వ్యవహరిస్తున్నారు. 1991 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన రామకృష్ణారావు ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఆర్థికశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈయన వచ్చే ఆగస్టులో పదవీ విరమణ పొందనున్నారు. ప్రస్తుతం ఉన్న ఐఏఎస్‌లలో సీనియర్‌గా ఉన్నారు. ఆర్థికశాఖలో ఈయన చేసిన సేవలు, ఆర్థికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించడంలో అనుభవం తోడ్పడుతున్నదనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి.. ఆయన్ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తెలుస్తున్నది. రామకృష్ణారావు గతంలో నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు కలెక్టర్‌గా పని చేశారు. 1991బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావు ప్రస్తుతం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఆయన విధులు నిర్వర్తిస్తోన్న ఆర్థిక శాఖ పోస్టుకు సర్కార్ ఎవరినీ నియమించలేదు. దీంతో కొత్త నియామకం అయ్యే వరకు రామకృష్ణారావే... ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. తాజాగా పరిపాలనలో ప్రక్షాళన దిశగా సీఎం రేవంత్ చర్యలు చేపట్టారు. సీఎం కార్యాలయంలోనూ మార్పులు చేర్పులు చేపట్టినట్లు తెలిసింది. ఇదీలావుంటే పదవి విరమణ తర్వాత శాంతి కుమారిని చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా నియమించనున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఆమె నియామకం ఇప్పటికే ఖరారైందనీ అధికారిక ప్రక్రియ మాత్రమే జరగాల్సి ఉందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతున్నది.



## 'మన్ కీ బాత్' వీక్షించిన బీజేపీ నాయకులు

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని తాటిపల్లి గ్రామంలోని 288 బూత్ లో పీఎం ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు ఆదివారం వీక్షించారు. మండలధ్యక్షుడు గాజుల మల్లేశం మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి శక్తి కేంద్రంలో మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొని పీఎం మాటల్ని ప్రజలోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులు చేయాలని కార్యకర్తలకు సూచించారు. మండల బీజేపీ సంచర్ సంయోగి ఉప్పు రాంకిషన్ , బింగి వేణు, నాగరాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

# 20 మంది ఐఏఎస్‌లు బదిలీ

## స్మిత సబర్వాల్‌కు కీలక శాఖ

- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి

**కలంజ్యోతి, హైదరాబాద్ :** పరిపాలనలో ప్రక్షాళన దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్పులు చేపట్టారు. నిర్వహణ అవసరాల దృష్ట్యా పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో 20 మంది సీనియర్, జూనియర్ ఐఏఎస్ లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వైస్ ఛైర్మన్‌గా శశాంక్ గోయల్.. ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవోగా జయేశ్ రంజన్.. పరిశ్రమలు, వాణిజ్యం ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్.. పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా టీకే శ్రీదేవి.. కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిశోర్.. ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా స్మితా సబర్వాల్ నియమితులయ్యారు. పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఇలంబర్తి.. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్.. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా కె.శశాంక..జెన్‌కో సీఎండీగా ఎస్. హరీష్.. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సెక్రటరీ, సీఈవోగా నిఖిల.. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా సంగీత సత్యనారాయణ.. దేవాదాయశాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట ఈవోగా ఎస్. వెంకటరావు లను ప్రభుత్వం ఎంపిక చేసింది. సెర్ప్ అదనపు సీఈవోగా పి.కాత్యాయనీదేవి, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ గా భోర్ ఖడే హేమంత్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీగా జి.ఫణీంద్రరెడ్డి, పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి జాయింట్ కమిషనర్ గా పి. కదివరన్, హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా కె. విద్యాసాగర్, హెచ్ఎండీఏ కార్యదర్శిగా ఆర్. ఉపేందర్ రెడ్డి (నాన్ క్యాడర్) నియమితులయ్యారు. కాగా ఈ బదిలీల్లో ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌కు కీలక శాఖ కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వానికి స్మిత సబర్వాల్ కు మధ్య కోల్డ్‌వార్ జరుగుతున్నది. తాజాగా కంచ గచ్చిబౌలి భూముల విషయంలో మార్ఫింగ్ చేసిన ఫొటోను రీ ట్వీట్ చేసిన స్మితా సబర్వాల్‌కు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ నోటీసులు జారీ చేశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో స్మితా సబర్వాల్‌కు ప్రాధాన్యత లేని శాఖలు కట్టబెడుతారని అందరూ ఊహించినప్పటికీ.. ఆమెకు ఆర్థిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశమైంది.



# కర్రెగుట్ట కూంబింగ్‌లో బిగ్ ట్విస్ట్..

### భారీ సొరంగాన్ని గుర్తించిన భద్రతా బలగాలు..

### మావోయిస్టుల ఆచూకీ కోసం గాలింపు..


**కలంజ్యోతి, హైదరాబాద్ :** గత ఆరు రోజులుగా కర్రెగుట్టలలో భద్రతా బలగాలు కూబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఈ ఆపరేషన్ లో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీజాపూర్, తెలంగాణ సరిహద్దు కర్రె గుట్టలలో భారీ సొరంగాన్ని భద్రతా బలగాలు గుర్తించారు. ఈ సొరంగంలో ఒక ప్రాంతం నుంచి మరో మార్గం ద్వారా బయటికి వెళ్లేందుకు వీలుగా ఉందని భద్రతాదళాలు చెబుతున్నాయి. కొన్ని రోజులుగా ఈ సొరంగాన్ని స్థావరంగా చేసుకొని మావోయిస్టులు దాడులకు తెగబడ్డారని పేర్కొన్నాయి. అయితే, ఈ సొరంగంలో సరైన గాలి, నీరు వాతావరణం ఉంది.. అంతే కాకుండా ఇక్కడ విశాలమైన ప్రాంతం కూడా ఉందన్నారు.ఈ సొరంగంలో 1000 మంది పట్టేంత స్థలం ఉందని అధికారులు వెల్లడించారు..


**బలగాలు భారీ విజయం..**

కాగా, కర్రెగుట్ట కొండల్లో నక్సలైట్లపై కొనసాగుతున్న ఆపరేషన్‌లో భద్రతా బలగాలు భారీ విజయం సాధించాయి. ఎండ వేడిమి, 45 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య శ్రమించి.. ఎట్టకేలకు వారి స్థావరానికి చేరుకోగలిగారు. అయితే భద్రతా దళాలు అక్కడికి చేరుకోకముందే మావోయిస్టులు తమ స్థావరాన్ని మార్చుకున్నట్లు సమాచారం. ఎందుకంటే ఇక్కడ వారు ఉన్నట్టు ఆనవాళ్లు దొరికాయి. ఈ గుహలో చాలా రోజుల పాటు వెయ్యి మందికి పైగా ఆశ్రయం పొందవచ్చని చెప్పుకొచ్చారు. ఈ సొరంగానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను చిత్రీకరించారు.

**పట్టుదలతో ఉన్న భద్రతా దళాలు..**

ఇక, పెద్ద సంఖ్యలో మావోయిస్టులు కూడా డీహైడ్రేషన్ బారిన పడుతున్నారు. ఈ కూంబింగ్ ప్రారంభమైనప్పటి నుంచి నక్సలైట్లు ఆహారం, మంచి నీటి కోసం వెంపర్లాడినట్లు తెలుస్తుంది. నక్సలైట్లు తమను తాము సురక్షితంగా ఉంచుకోవడానికి సుమారు 4 నెలల పాటు రేషన్‌తో కర్రెగుట్ట కొండలలో క్యాంప్ ఏర్పాటు చేసుకున్నప్పటికీ.. భద్రతా బలగాలు కర్రెగుట్టను చుట్టుముట్టడంతో.. ఆ రేషన్ కూడా వారికి ఉపయోగపడలేదు. కొండలపై నుంచి దిగితే సైనికుల తూటాలకు బలి అవుతారనీ, భయంతో కొండలపైనే ఎక్కువ కాలం దాక్కుని ఉంటే డీహైడ్రేషన్ వల్ల చనిపోతామనే భయం వారిని వెంటాడుతుంది. మరో వైపు, నక్సలైట్లు దాక్కున్న కొండలను మొత్తం స్వాధీనం చేసుకునే వరకు ఈ ఆపరేషన్ కొనసాగించాలని భద్రతా దళాలు పట్టుదలతో ఉన్నాయి. ఇక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు చొరవ చూపాలంటూ ఇటీవల నక్సలైట్లు ప్రెస్ నోట్ విడుదల చేశారు.





### హైదరాబాద్‌లోని పాకిస్తానీయులకు

# లీవ్ ఇండియా నోటీసులు

- హైదరాబాద్‌లో మొత్తం 230 మంది
- 199 మందికి లాంగ్ టర్మ్ వీసాలు,
- 31 మందికి షార్ట్ టైం వీసాలు



**కలంజ్యోతి, హైదరాబాద్ :** పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ పాక్ పై దౌత్య దాడికి దిగింది. ఇందులో భాగంగా భారత్ లో ఉన్నటువంటి పాక్ పౌరులను ఆ దేశానికి పంపించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో హైదరాబాద్ లోని పాకిస్తానీయులకు లీవ్ ఇండియా పేరుతో నోటీసులు అందజేశారు అధికారులు. హైదరాబాదులో మొత్తం 230 మంది పాకిస్తానీయులు ఉన్నట్లు గుర్తించారు. 199 మందికి లాంగ్ టర్మ్ వీసాలు, 31 మందికి షార్ట్ టైం వీసాలు ఉన్నాయని గుర్తించారు. షార్ట్ టర్మ్ వీసాలు ఉన్న ఎనిమిది మందికి దేశం విడిచిపోవాలని నోటీసులు జారి చేశారు. మెడికల్ వీసాలు తీసుకున్న వారికి ఈ నెల 29 వరకు గడువు విధించారు. పాకిస్తానీయులు తెలంగాణ రాష్ట్రం విడిచి వెళ్లిపోవాలని డీజీపీ జితేందర్ ఆదేశాలు జారీ చేశారు. షార్ట్ టర్మ్ వీసాలు ఉన్నవారు దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు. అధికారుల ఆదేశాలతో పాకిస్తానీయులు స్వదేశానికి వెళ్తున్నారు. వాఘా అట్టారీ బార్డర్ కు చేరుకుంటున్నారు. బార్డర్ వద్ద గంభీర వాతావరణం నెలకొంది.

Cinema
కలంజ్యోతి
సోమవారం 28.04.2025

# రకుల్ గ్లామర్ అదుర్స్..



హిందుస్తాన్ టైమ్స్ సిటీ షోస్టాపర్స్ కార్యక్రమం కోసం ఇటీవల రకుల్ ప్రీత్ సింగ్ దిగిన ఫొటోలు అందరినీ మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. నవ్యసా బై లివా రూపొందించిన పాతకాలపు పూల డిజైన్ చీరలో ఆమె తళతళ మెరిసిపోతోంది. చీర అందాన్ని మరింత పెంచుతూ, రకుల్ అరుదైన బస్రా ముత్యాలతో తయారైన నెక్లెస్ ధరించింది.. చౌలాజ్ హెరిటేజ్ జ్యూవెల్స్ కలెక్షన్‌లో ఉన్న, వందేళ్ల నాటి ప్రాచీన నెక్లెస్ అది.. ముంబైలోని ది ఒబెరాయ్ హోటల్ వేదికగా జరిగిన ఈ ఫోటోషూట్‌కు శారా అష్రాఫ్ ప్రయాగ్ నేతృత్వం వహించారు. ఫోటోగ్రాఫర్ తేజస్ నేరుర్కర్ కెమెరా క్లిక్‌లతో రకుల్ అందాన్ని అద్భుతంగా పట్టుకున్నారు. స్టైలిస్ట్ కరిష్మా పాటిదార్ మినహా, ఒక గొప్ప క్రియేటివ్ బృందం ఈ మేజిక్‌కు సహకరించింది. ఈ ఫోటోషూట్ సందర్భంగా రకుల్ తన సినీ ప్రయాణాన్ని తలుచుకుంది. ఢిల్లీ అమ్మాయి బాలీవుడ్ స్టార్‌గా ఎదిగిన తన కథను చర్చించింది. సినీ రంగంలోకి అడుగుపెట్టినప్పుడు 'ఇట్ గర్ల్' అంటే ఏమిటో కూడా తెలియదని చెప్పిన రకుల్, అప్పటి వాస్తవాలను గుర్తు చేసింది.. హీరోయిన్ల కెరీర్ అయిదారు ఏళ్లకే ముగుస్తుందని తప్పడు అభిప్రాయాలు విస్తరించాయని చెప్పింది. అయితే ఈ రోజులలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని రకుల్ విశ్వాసం వ్యక్తం చేసింది. 'సౌందర్యం, కృషి, నిబద్ధత ఉంటే, వయస్సు తేడా లేకుండా హీరోయిన్లు సుదీర్ఘకాలం తమ కీర్తిని నిలుపుకోగలరని' ఆమె నమ్మకం. అమితాబ్ బచ్చన్, టబు లాంటి వారిలా ఇండస్ట్రీలో ఓ చిరస్థాయిగా నిలవాలన్నది ఆమె లక్ష్యం. తెలుగు సినిమాలతో తన ప్రయాణాన్ని ప్రారంభించిన రకుల్, 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'లౌక్యం' లాంటి హిట్‌లతో తొలి మెట్లు ఎక్కింది. తరువాత టాలీవుడ్, బాలీవుడ్‌లలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంది. 'దే దే ప్యార్ దే', 'డాక్టర్ జి', 'రన్‌వే 34' వంటి సినిమాల్లో తన నటనా ప్రతిభను నిరూపించింది.